ప్రజాశక్తి

బుధవారం 15 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

తగ్గింది గోరంత..ప్రచారం కొండంత..

- పాత స్టాక్ పేరుతో పాత ధరలకే అనేక వస్తువుల అమ్మకం
- సిమెంటు బస్తాకు రూ.30..
- టన్ను ఇనుముకు రూ.4 వేలు తగ్గుదల
- కార్ల ధరల్లోనూ పెద్దగా కనిపించని తగ్గుదల
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరల్లో స్వల్ప మార్పు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రచారానికి తెరలేపాయి. అన్నీ వదిలేసి ఇప్పుడు ఇదే కార్యక్రమాన్ని పెద్ద ఎజెండాగా తీసుకున్నాయి. ఇప్పటి వరకూ రూ.కోట్లలో వసూలు చేసిందెవరు? దానిపై మాత్రం నోరువిప్పడం లేదు. ఎడాపెడా జిఎస్‌టి వసూలు చేసి ఇప్పుడు కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల కోసం.. భారీగా తగ్గించామంటూ పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఇక్కడ పాలకపక్షం కూడా ఈ విషయం భుజానకెత్తుకుంది. ఇప్పటికే వివిధ రంగాల్లో జీఎస్టీ తగ్గింపు వల్ల భారీగా ఆదాయం అనే పేరుతో సభలు, ర్యాలీలు పెడుతున్నారు. వాస్తవానికి ఏ వస్తువు ధర ▶ 2లో

నేటి నుంచి విద్యుత్ కార్మికుల సమ్మె

8లో ▲



హాస్టల్‌లో భోజనం రుచి చూస్తున్న సిపిఎం నేతలు

హాస్టళ్లలో సదుపాయాలు మెరుగుపరచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు

8లో ▲

తగ్గింది గోరంత..ప్రచారం కొండంత..

(మొదటిపేజీ తరువాయి)

ఎంత తగ్గించారో ఎక్కడైనా ప్రభుత్వం పోస్టర్ వేసిందా? దుకాణాలు వద్ద పాత, కొత్త ధరలతో బోర్డులు పెట్టారా? నిజంగా తగ్గింపు ప్రభావం ఉందా? అంటే ఎక్కడా జరుగుతున్న ప్రచారానికి తగ్గట్లుగా లేదు. కనిపించడం లేదు. ధరల్లో మార్పులు స్వల్పంగానే ఉన్నాయి. అవి కూడా కొన్ని రంగాల్లోనే కనిపిస్తున్నాయి. పాత స్టాక్ పేరుతో పాత ధరలకే అమ్ముతున్నారు. పెద్దపెద్ద మాల్స్‌లో మాత్రం కొంత తగ్గించే యత్నం కనిపిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు ఏ ఒక్కటీ తగ్గలేదు. జీఎస్‌టీ తగ్గుదల మేరకు వస్తువుల ధరలు పెంచారు. దీనిపై ఏమాత్రం ఊరట లేదు. గతంలో ధరలే ఇప్పుడూ ఉన్నాయి. నిర్మాణరంగంలో చూస్తే సిమెంటు బస్తాపై గతానికి ఇప్పటికీ రూ.30 తగ్గించారు. స్టీల్ టన్ను గతంలో రూ.57 వేలు ఉండగా ఇప్పుడు రూ.53,500 ఉంది. అంటే స్టీల్ టన్నుకు రూ.రూ.3,500 నుంచి రూ.4 వేల వరకూ తగ్గిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుక ట్రక్కు రూ.4వేలకుపైగానే అమ్ముతున్నారు. దీని వల్ల నిర్మాణదారులకు ఎంత నష్టమో చెప్పాల్సిన అవసరం లేదు. రెండు, మూడు వస్తువులపై స్వల్పంగా ధర తగ్గితే ఇసుక కొనుగోళ్లపైనే భారీగా నష్టం కనిపిస్తోంది. హార్డ్‌వేర్ సామాగ్రిపైనా ధరలు తగ్గుదల ప్రచారానికే పరిమితమయ్యాయి. వాటి ధరలు ఎంతనేదీ తెలియదు. వస్తువులపై వేసే ధరలకూ, అమ్మే ధరలకు భారీగా తేడా ఉంటుంది. హార్డ్‌వేర్ వస్తువులపై ధర రూ.200 ఉంటే కొందరు రూ.150 అమ్ముతారు. కొందరు 180కి అమ్ముతారు. ధరలపై స్పష్టత లేదు. ఇవన్నీ బ్రాండెడ్ పరిధిలో ఉండవు. ఇక కార్ల ధరలూ ఎక్కడా తగ్గినట్లు ఏ కంపెనీ చెప్పడం లేదు. మొన్న పండుగల పేరుతో ఆఫర్లు ఇచ్చారు. ఇప్పుడు జీఎస్‌టీ తగ్గాక ఆ ఆఫర్లను ఎత్తేశామంటున్నారు. దీంతో ధరల్లో సర్దుబాటు జరిగింది. ఏ కారు ధర ఎంత తగ్గిందనే సమాచారం ఏ కారు కంపెనీ వద్ద కూడా పెట్టలేదు. కారణం తగ్గింపు లేకపోవడమే.. ఎలక్ట్రానిక్స్ వస్తువుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. వాటిపై ఉన్న ధరలకు ఏ వస్తువూ అమ్మకం జరగదు. బేరాలు ఉంటాయి. ఎమ్మార్పీ రూ.40 వేలు ఉన్న ఏసీలను రూ.35 వేల నుంచీ రూ.38 వేలకు అమ్ముతుంటారు. ఇప్పుడు జీఎస్‌టీ చర్చకు వస్తే వాటిపై ఉన్న అసలు ధరలపై స్వల్పంగా తగ్గించి అమ్మినా ఇంకా వ్యాపారులకే లాభం ఉంటుంది. ఏసీలపై రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ ధరలు తగ్గినట్లు చెబుతున్నారు. కొన్ని కంపెనీలే ఈ తగ్గింపులో ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువులపై పండుగల సందర్భంగా పలు కంపెనీలు భారీగా ఆఫర్లు ఇస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ఆన్‌లైనులో కొనుగోలు చేస్తే 30 నుంచి 40 శాతం కూడా తగ్గింపు ఇస్తున్నారు. ఏ వస్తువు వాస్తవ ధర ఎంతనేదీ స్పష్టత ఉండదు. ధరలను ఇంత భారీగా ఎలా తగ్గిస్తున్నారో కూడా స్పష్టత లేదు. వస్తువు తయారీ ఖర్చు కన్నా అధిక ధరలు ముద్రించి వాటిపై ఆఫర్ల పేరుతో తగ్గింపులు చూపి.. అమ్మకాలు చేస్తున్నారు. ఫ్లిప్‌కార్టు, అమెజాన్, మిత్రా తదితర ఆన్‌లైను బిజినెస్ సంస్థల్లో కొనుగోళ్లపై భారీగా ఆఫర్లు ఇస్తున్నారు. ధరల్లోనే ఇంత తేడాలుంటే అసలు జీఎస్‌టీ తగ్గింపుతో వస్తువుల ధరల్లో తగ్గుదల ఉందనే ప్రచారం జనానికి ఎంత మేరకు లబ్ధి చేకూర్చుతుందనేది ఆలోచించాలి. చాలా వ్యాపారాలు పాత స్టాక్ పేరుతో పాత ధరలకే అమ్ముతున్నారు. దీనిపైనా అధికారులు దాడులు చేస్తున్నారు. కాసేపు తగ్గించి తర్వాత మామూలుగానే అమ్ముతున్నారని చెబుతున్నారు. ఏదేమైనా జీఎస్‌టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగానే ప్రచారం మొదలుపెట్టాయి.

17న జాబ్ మేళా

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు డొంక వద్దగల మహిళా ప్రాంగణంలో బహుళ జాతీయ కంపెనీలతో ఈ నెల 17వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో పదికి పైగా బహుళ జాతీయ కంపెనీలతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 17న శుక్రవారం నాడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ మెగా జాబ్ మేళా జరగనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు గల పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

సజ్జ పంట కోత ప్రయోగం పరిశీలన

ప్రజాశక్తి-పొదిలి

మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కనిగిరి డివిజన్ గణాంక అధికారి సుధాకర్ మంగళవారం మండలంలోని సలకనూతల గ్రామంలో సజ్జ పంట కోత ప్రయోగ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వర్లు అనే రైతు పొలంలో 5 ఇంటు 5 మీటర్ల పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ఓ సుధాకర్ మాట్లాడుతూ ఈ పంట కోత ప్రయోగం ఆధారంగా పంట దిగుబడులు అంచనా వేస్తారని తెలిపారు. అలాగే ఈ పంట కోత ప్రయోగం నిర్వహించడం వల్ల రైతుకు ఎంతమేరా దిగుబడి, ఆదాయం వస్తుంది అనేది తెలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ నాయకులు ఆదినారాయణరెడ్డి, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో నీటి సౌకర్యం కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి


విద్యార్థులతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

కొండేపిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి నీటి వసతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్‌తో కలిసి ఆయన మంగళవారం హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాస్టల్లో ఎదురవుతున్న సమస్యల గురించి వివరించారు. హై స్కూల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన ఈ వసతి గృహంలో ఈ సంవత్సరం ఒక్కరు కూడా హైస్కూల్ విద్యార్థులు ఈ హాస్టల్లో చేరలేదు. మంత్రిగారి చొరవతో ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులకు తాత్కాలికంగా ఈ హాస్టల్‌లో వసతి, భోజనం ఏర్పాటు చేశారు. ఈ ప్రయత్నం మంచిదే అయినా విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో తగిన శ్రద్ధ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హాస్టల్లో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లకు నీటి వసతి లేనందున వినియోగంలో లేకుండా పోయాయని విద్యార్థులు తెలిపారు. స్నానానికి, వాడుకునేందుకు వినియోగించుకునే నీరు బోరు ద్వారా వాడుకుంటున్నామన్నారు. ఆ బోరు అరగంటపాటు కొట్టినా కూడా బకెట్ నీళ్లు కూడా రావడంలేదని విద్యార్థులు ఆవేదనతో చెప్పారు. స్నానాలు చేయాలన్నా, బట్టలుతుక్కోవాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నట్లు వారు తెలియజేసారు. వసతి గృహం ఆవరణలో పాములు, తేళ్లు, మంత్రగబ్బలు తిరుగుతున్నాయని వాటి నుంచి రక్షణ కల్పించే విధంగా పరిసరాల పరిశుభ్రత చేయాలని విద్యార్థులు కోరారు. వీటితోపాటు దాన్ని కాలేజీ హాస్టల్‌గా మార్చి రెగ్యులర్ ట్యూటర్ను నియమించడం ద్వారా వసతిగృహాన్ని అభివృద్ధి చేయాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలో రాంగ్ రూట్లో వస్తున్న ఒక ప్రైవేట్ స్కూల్ మినీ వ్యాన్ ఎదురుగా వస్తున్న మోటార్ సైకిలిస్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరవది గ్రామానికి చెందిన మోటార్ సైక్లిస్ట్ సంగిశెట్టి వెంకటేశ్వరరావు(47) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన ఒంగోలు నుంచి పేర్నమిట్ట గ్రామానికి తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, హెడ్ కానిస్టేబుల్ నాగూర్ వలి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు తాలూకా సబ్ ఇన్‌స్పెక్టర్ హరిబాబు కేసు నమోదు చేశారు.

తెల్లరాయి క్వారీలపై మైనింగ్ అధికారుల దాడి


క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పీసీపల్లి :

అక్రమంగా తెల్లరాయి తీస్తున్న క్వారీల పై ఒంగోలు మైనింగ్ అధికారులు దాడి చేశారు. మంగళవారం గుంటుపల్లి పరిసర ప్రాంతాలలో తెల్ల రాయి తీస్తున్న విషయం స్థానికులు అందించిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. చైన్ జెసిబిని, కంప్రెస్డ్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. విఆర్ఓ రఫీ అహ్మద్‌కు వాటిని అప్పగించారు. ఒంగోలు మైనింగ్ అధికారి చల్లా సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఈ దాడులు జరిగాయి.


వినతులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

వినతులు స్వీకరించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి స్వామి తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-దర్శి

నవంబర్ 3వ తేదీ దర్శి పురపాలక సంఘం కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం దర్శి పురపాలక సంఘం మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దర్శి పురపాలక సంఘం జూనియర్ అసిస్టెంట్ సుజాతకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు 12వ పిఆర్‌సిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో తీసుకున్న అదనపు కార్మికులను అప్కాస్ నందు నమోదు చేసి జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇత్తడి ఇర్మియా, ఇత్తడి ఇసాక్, ఇత్తడి దావీదు, చాట్ల బాబురావు, ఇత్తడి పెద పుల్లయ్య, ఇత్తడి గురవయ్య, పాకాల దేవా, డి.మురళి పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న సానికొమ్ము తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కుటుంబ సాధికార సభ్యులు (కేఎస్ఎస్) కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. నందనవనం, వీరరామపురం గ్రామాలలో కెఎస్ఎస్ సభ్యులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చామన్నారు. ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్టు చెప్పారు. రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనేక సంక్షేమ కార్యక్రమాలు నెరవేర్చినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. గ్రామాలలోని సమస్యలను కేఎస్ఎస్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని అన్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విరివిగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీలో కేఎస్ఎస్ సభ్యులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఇకనుంచి గ్రామస్థాయి కేఎస్ఎస్‌ల పాత్ర పార్టీలో కీలకం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు నరసారెడ్డి, సర్పంచ్ పరిసిపోగు కృపారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చీకటి వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, కార్యదర్శి సుమిత్ర తిరుపతిరెడ్డి, కూరాకు వెంకట్, ఆకుపాటి శీను పాల్గొన్నారు.

పరీక్షలు పూర్తి కాగానే మూల్యాంకనం చేపట్టాలి

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను మూల్యాంకనం చేపట్టి మార్కులను ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ-2 రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని డిజిపేట జడ్.పి.హెచ్.ఎస్, మోడల్ ప్రైమరీ పాఠశాలలలో నిర్వహిస్తున్న ఎఫ్ఏ 2 పరీక్షలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసి విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షేక్ పిఎం రసూల్, సిఆర్‌పి సతీష్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం


కొనకనమిట్ల మండలంలోని పాతపాడు నుంచి గొట్లగట్టు ఉన్నత పాఠశాలకు ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల


పొగాకు కంపెనీ నుంచి వస్తున్న పొగలు

పొగాకు కంపెనీలో ఆగని పొగలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలికివాయి దగ్గర ఉన్న బెల్లం కోటయ్య పొగాకు కంపెనీలో శుక్రవారం తెల్లవారుజామున చెలరేగిన మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. బి కే త్రేషింగ్ కంపెనీలో మొత్తం ఆరు బ్లాకులు ఉండగా రెండు బ్లాకుల్లో మంటలు చెలరేగాయి. అయితే ఐదు ఫైరింజన్లు నిరంతరం మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ లోపల భారీ ఎత్తున పొగాకూ ఉండటంతో ఆ పొగాకు బేళ్లు తగలపడుతూనే ఉ న్నాయి. సోమవారం, మంగళవారం ఉదయం వర్షం వచ్చినా మంటలు ఆగని పరిస్థితి. మంగళవారం రాత్రి పొగాకు కంపె నీలో నుంచి పొగలు భారీ ఎత్తున వస్తూనే ఉన్నాయి.

పేదల కాలనీల్లో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

అకాల వర్షాలకు పట్టణంలో నీట మునిగిన నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. పట్టణంలో వర్షపు నీరు నిలిచిన 1వ వార్డు గంగపుత్ర కాలనీ, ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ ప్రాంతాలను ఆయన మంగళవారం సందర్శించారు. వర్షపు నీరు నిలిచి అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదల నివాస ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, త్రాగునీరు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మోకాల్లోతు వర్షపు నీటిలో తప్పని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో పాలక ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గంగపుత్ర కాలనీ వంటి ప్రాంతాల్లో ప్రజల కనీస అవసరాలు తీర్చకుండా పన్నులు కట్టించుకుంటున్నారని అన్నారు. వర్షం కురిస్తే నీళ్లల్లో పాములు తిరుగుతున్నాయని అన్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ప్రభుత్వ భవనాలు, పార్కులు, విద్యుత్ స్తంభాలకు రోప్ లైటింగ్ వేసే పనులు తప్ప పేదల కాలనీల్లో అంతర్గత రోడ్లు, త్రాగునీరు, వీధి దీపాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీల్లోని పిల్లలు పాఠశాలకు వెళ్ళటానికి, వృద్ధులు, వికలాంగులు నడవడానికి నరకయాతన అనుభవించాల్సి వస్తుందని అన్నారు. అధికారులు, కార్యాలయాలు చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చిన పట్టించుకోలేదని అన్నారు. హౌసింగ్ పీడీ, మున్సిపల్ కమిషనర్ ఒకరిపై ఒకరు తమ పరిధి కాదంటే తమ పని కాదంటూ చెప్పడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. ప్రజల ఇబ్బందులు గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తుంటే పట్టీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కనీసం శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ చొరవ తీసుకుని ప్రజల ఇబ్బందులు గమనించి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శరత్, జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు శీను, లోకేష్, భాగ్యలక్ష్మి, సల్మా సాంబశివరావు పాల్గొన్నారు.


గంగపుత్ర కాలనీలో పరిశీలిస్తున్న సిపిఎం కార్యదర్శి సిహెచ్ గంగయ్య

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి


తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతులు

ప్రజాశక్తి - పంగులూరు

భూ యజమానితో సంబంధం లేకుండా, అర్హులైన కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు జమ అయ్యేటట్లు చూడాలని అన్నారు. నూతన కౌలు చట్టం తీసుకురావాలని అన్నారు. నల్లబర్లి పొగాకు రైతులకు రావలసిన డబ్బులు వెంటనే అకౌంట్లో వేయాలని చెప్పారు. రైతులకు సరిపడునంత యూరియా సరఫరా చేయాలని కోరుతూ తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని అన్నారు. పాత చట్టంలోని లోపాలు సవరిస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. కౌలు రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన చేర్చడం వల్ల భూ యజమానులు ఎక్కువ మంది సంతకం పెట్టి అనుమతులు ఇవ్వటానికి అంగీకరించటం లేదని అన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఆర్బిఐ గైడ్లైన్స్ ప్రకారం రూ.2లక్షల వరకు హామీలేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసిన ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో డబ్బు ఇవ్వలేదని అన్నారు. తక్షణమే రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని కోరారు. అనంతరం ఇంచార్జ్ తహశీల్దారు శ్రీ చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బెజ్జం రమేష్ పాల్గొన్నారు.

కారంచేడు : రైతుల ఎదుర్కొన్న సమస్యలపై తహశీల్దారుకు కౌలు రైతు సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ రూ.20 వేలు కౌలు రైతులకు జమ చేయాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇప్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య, ఏడుకొండలు, పి వెంకటేశ్వరరావు, వి బలరామకృష్ణ, మట్టే పిలిప్, కె సుబ్బారావు, కె ప్రకాశరావు, వి నాగేశ్వరరావు ఉన్నారు.

వేమూరు : కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం ఇస్తామనీ ప్రకటించిన రూ.20 వేలు కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దారుకు వినతి పత్రం మంగళవారం అందజేశారు. కౌలు రైతు నాయకులు తోడేటి సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే పాత కౌలు చట్టాని రద్దుచేసి కొత్త కౌలు చట్టాని తీసుకువస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు నాయకులు జంపాని వెంకట ప్రసాద్, గొరికపూడి కోటయ్య, మునిపల్లె కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కారంచేడులో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు


వేమూరులో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తీరంలో భద్రతా చర్యలు పటిష్టం



మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి- చీరాల

సముద్రతీరాలకు విహార యాత్రకు వచ్చే యాత్రికులు పోలీసు సూచనలు, హెచ్చరికలు పాటించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు మరింత పటిష్టం చేస్తున్నామని ఎస్పీ బి.ఉమామేశ్వర్ తెలిపారు. కూచిన షారోన్ రాజు మృతదేహాన్ని నాగులుప్పలపాడు మండలం కనపర్తి సముద్రతీరంలో గుర్తించారని తెలిపారు. సూచించిన ప్రదేశాల్లోనే సముద్రంలో స్నానాలు ఆచరించాలని తెలిపారు. మైకుల్లో పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ ఉంటారని చెప్పారు. రాకాసి అలలు వచ్చినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పోలీస్, మెరైన్, గజ ఈతగాళ్లతో పాటు డ్రోన్లతో నిఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాపట్ల : వేటపాలెం మండలం రామపురం బీచ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాలపై అప్రమత్తమైన అధికారులు సూర్యలంక బీచ్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. తహశీల్దారు షేక్ సలీమా, ఎంపిడిఒ బి బాబురావు ప్రమాదాల నివారణకు సిబ్బందికి, గజ ఈత గాళ్లకు సూచనలు చేశారు. నిత్యం మైకుల ద్వారా నడుము లోతుకు మించి లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు నియంత్రించడానికి పర్యాటకుల భద్రతపై చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. ఏ ఒక్క ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని పోలీసులు, గజతగాళ్లు పర్యవేక్షణ చేయాలని అన్నారు. మైకుల్లో ప్రమాదాలపై అప్రమత్తత చేస్తూ పర్యటకుల భద్రత ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.


గజ ఈతగాళ్ళకు సూచనలు చేస్తున్న తహశీల్దారు



మాట్లాడుతున్న సిహెచ్ విశ్వనాద్

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సైబర్ సెక్యూరిటి, ఎథికల్ హాకింగ్‌పై రెండు రోజుల వర్క్ షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. బిటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటి, ఎథికల్ హాకింగ్‌పై వర్క్ షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. హైదరాబాద్ నివి సైబర్ సెక్యురిటీ సొల్యూషన్స్ ఎక్స్‌పర్ట్ సిహెచ్ విశ్వనాద్, లావణ్యా టెక్నాలజీస్ మోహన్ రంగా ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఐటి విభాగాధిపతి ఎస్ ఇంద్రనీల్ తెలిపారు. ఆధునిక కంప్యూటర్ టెక్నాలజి ప్రపంచంలో సైబర్ సెక్యూరిటి ఎంతో ప్రాధాన్యత వహిస్తున్నదని తెలిపారు. ప్రతిఒక్కరు సైబర్ సెక్యూరిటిపై అవగాహన కలిగి విలువైన డేటా, ధనం కాపాడు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు, హెచ్ఒడిలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతు నాయకులు నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - మార్టూరు


మండలంలోని చిమ్మిరిబండకు చెందిన రైతు సంఘ నాయకులు గాడిపర్తి శివ నాగేశ్వరరావు (62) గుండెపోటుతో స్వగ్రామంలో మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి రైతు సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు పాలెపు సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు, గోనుగుంట మోహనరావు, నాగబోయిన సాంబశివరావు, డి సదాశివరావు, వై రాంబాబు, భత్తుల హనుమంతరావు, పి హనుమంతరావు ఉన్నారు.


పిడి అనిల్ కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న వీరనారాయణ

కోటేలు డొంక వద్ద అండర్ పాస్

ప్రజాశక్తి - పంగులూరు

బెంగళూరు, విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో 'కోటేలు డొంక' క్రాస్ దగ్గర ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రైతు ప్రతినిధి దూళిపాళ్ల వీరనారాయణ డిమాండ్ చేశారు. రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే ఇబ్బంది ఏర్పడుతుందని చెప్పారు. భవిష్యత్తులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలంటే అక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అన్నారు. గత మూడేళ్ల నుండి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలెక్టర్‌ను కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్16 పిడి అనిల్ కుమార్‌రెడ్డి పరిశీలించేందుకు వచ్చారు. పలువురు రైతులు ఆయనను కలిశారు. పురాతన కాలం నుండి ముప్పవరంలోని సాయిబాబా గుడి పక్కన ఎన్‌హెచ్ 16 నుండి ముప్పవరం పొలంలోకి వెళ్లే దారిని కోటేలు డొంకని పిలుస్తారని, ఈ డొంక నుండి ముప్పవరం, జాగర్లమూడి వారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు అరకలు, బండ్లు, ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్ళు, గేదెలు, కాలినడకన రాకపోకలు జరుపుతున్నారని చెప్పారు. భవిష్యత్తులో రైతులు ఈ మార్గం గుండానే పొలాలకు వెళతారని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ముప్పవరం, జాగర్లమూడి వారిపాలెంకు చెందిన రైతులు పాల్గొన్నారు.


తైక్వాండో పోటీలకు ఎంపికైన యార్లగడ్డ లక్ష్మిప్రియ

తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఈనెల 6న ఒంగోలులో నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని యార్లగడ్డ లక్ష్మిప్రియ 52 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దేవరకొండ సరోజిని తెలిపారు. ఈ సందర్భంగా పిఈటిలు జడ దేవభిక్షం, జరుబుల శ్రావణి, స్టాప్ సెక్రెటరి కాల్వ సోమశేఖర్, ఉమ్మిటి వేణుగోపాలరావు, అత్తులూరి వెంకటసుబ్బారావు, అవ్వారు సుజాత, సజ్జా వసుధకుమారి, ఎల్ అంజమ్మ, టి గురుమని, డిఎల్ లక్ష్మీనారాయణ, బివి కృష్ణమూర్తి, ఎం బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో

కూటమి ప్రభుత్వం విఫలం: సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను (పిడిఎస్) దెబ్బతీస్తోందని, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల సరఫరా నిలిపివేయడం ప్రజలపై నేరుగా దాడిచేసినట్లేనని సిపిఎం ఒంగోలు నగర కమిటీ తీవ్రంగా విమర్శించింది. వీరాస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం, పప్పు, నూనె, చక్కెర, చింతపండు తదితర నిత్యావసరాలు అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి గత ఒక ఏడాదిన్నరగా రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా నిలిపివేయడంపై మండిపడ్డారు. కొన్ని షాపుల్లో సరుకులకు బదులు డబ్బులు ఇవ్వడం పథకాన్ని తప్పుదారి పట్టిస్తున్నట్లు ధ్వజమెత్తారు. కాగా నగరంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల డీలర్ల దందా సాగుతున్నదని ఆరోపించారు. 1991కు ముందు ఇచ్చిన డీకే పట్టాల రిజిస్ట్రేషన్ను ప్రభుత్వం జీవో ద్వారా అనుమతించినప్పటికీ, ఒంగోలు నగరంలో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని ఆరోపించారు. ఇంటి పన్నుల విషయంలో కూడా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొద్దికాలం నుంచి కురుస్తున్న వర్షాలతో డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమై.. నగరమంతా మునిగిపోతుందని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ, పైపైన పనుల మీద ఆసక్తి చూపుతున్నారు తప్ప డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడం లేదని ఆరోపించారు. కాగా ఎన్నికల సందర్భంగా నగరంలో పేదలందరికీ రెండు సెంట్ల ఇండ్ల స్థలం ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే అర్హులైన పేదలకు స్థలాలు ఇవ్వకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తంబి శ్రీనివాసులు, టీ. మహేష్, బి.వి. రావు, సయ్యద్ హుస్సేన్, ధారా వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసు నిగ్గు తేల్చేందుకు

సిబిఐ విచారణ చేపట్టాలి..

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న వరికూటి

నకిలీ మద్యం కేసు నిగ్గు తేల్చేందుకు సిబిఐ విచారణ చేపట్టాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నకిలీ మద్యం కేసుపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో వైయస్సార్‌సీపీ నాయకుడు జోగి రమేష్ పేరు ప్రస్తావన పూర్తిగా రాజకీయ కుట్రలో భాగ మని, దీనికి సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ సూత్రధారులని ఆయన ఆరోపించారు. నకిలీ మద్యం కేసును టీడీపీ నాయకులు ప్రజల దృష్టిని మళ్లించేందుకు, తమ నాయకులపై ఉన్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధన్‌రావు, టీడీపీ నేత జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు లాంటి వ్యక్తులు అందరూ టీడీపీకి సన్నిహితులని, మరి వారిని వదిలి వైయస్సార్‌సీపీ నేత జోగి రమేష్‌పై ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశ్యం తప్ప మరేమీ లేదన్నారు. నిజంగా ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలనుకుంటే సీబీఐ విచారణకు ఎందుకు అంగీకరించడం లేదు? అని ప్రశ్నించారు. సిబిఐ ఎంక్వయిరీ వేసే వరకు తాము ఉద్యమం చేపడతామని ఆయన ప్రకటించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి4 పరిధిలోని కమ్మపాలెం 2వ లైన్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

– 11 కె.వి. స్టోర్ బజార్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా గోపాల్ నగర్ ఎక్స్టెన్షన్ 1 వ లైన్ నుండి 4వ లైన్ వరకు, స్టోర్ బజార్, చాకలివాని కుంట మరియు ఆక్సిలియమ్ స్కూల్ వెనుక వైపు తదితర ప్రాంతాలకు బుధవారం ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ పేర్కొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధి కార్యదర్శుల బాధ్యత

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రామాల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ పి..రాజాబాబు స్పష్టం చేశారు. ఈ విషయాలలో నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ఒంగోలు డివిజన్ లోని పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెగ్యులర్ విధులతో పాటు తమ పరిధిలో జరిగే అభివద్ధి, ప్రభుత్వ ఆస్తులకు భద్రత, పారిశుధ్యం, ప్రజారోగ్యం, తాగునీటి సరఫరా సంబంధిత అంశాల పైన పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా (కస్టోడియన్) కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు ముగ్గురు కాకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇది పూర్తిగా రెవెన్యూకు సంబంధించిన అంశమని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. విధులలో మొక్కుబడిగా వ్యవహరిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. వీటికి సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం వహించినా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తినా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా విషయాలకు సంబంధించిన రోజువారీ సమాచారాన్ని తనకు పంపించాలని ఉన్నతాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిపిఓ ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సిఈఓ బి.చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ పాల్గొన్నారు.

'ఉపాధి'ని పటిష్టంగా అమలు చేయండి

- ఫీడర్ ఛానల్స్ పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. భూగర్భ జల స్థాయి పెరిగేలా చెక్ డ్యామ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, చెరువులు, ఫీడర్ చానల్స్ పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డ్వామా అధికారులకు సూచించారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్లోని తన చాంబర్‌లో కలెక్టర్ పి. రాజాబాబు, డ్వామా అధికారులతో సమావేశమై జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా అమలు జరుగుతున్న ఫారం ఫాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, ఫీడర్ ఛానల్స్ మరియు సప్లై ఛానల్స్ పూడికతీత పనులు, అమత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్, వంటి పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఉపాధి హామీ ద్వారా అమలు జరుగుచున్న వివిధ కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను, సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్వామా పిడి జి.జోసెఫ్ కుమార్ కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

'మెడిక్యూర్'లో అరుదైన సర్జరీ

- గుండెకు స్టంట్ వేయలేని స్థితిలో శస్త్ర చికిత్స
- కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్‌బాబు వెల్లడి



మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మెడిక్యూర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన సర్జరీని నిర్వహించారు. గుండెలో క్యాల్షియం పేరుకుపోయి.. స్టంట్ వేయలేని స్థితిలో అత్యాధునిక పరికరం ద్వారా సర్జరీ చేసి రోగిని కాపాడినట్లు హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీధర్‌బాబు తెలిపారు. స్థానిక రాంనగర్ నాలుగో లైన్ లోని మెడిక్యూర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన. కె.శేషగిరిరావు (83) అనే వ్యక్తి గుండెజబ్బుతో మెడికూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ని సంప్రదించారన్నారు. వైద్య పరీక్షల అనంతరం హైదరాబాద్, విజయవాడ తీసుకువెళ్లాలని వారి కుటుంబసభ్యులకు తెలియజేసినప్పటికీ వారి కుటుంబ సభ్యులు ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని కోరారన్నారు. ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రిల్లింగ్ మిషన్ లాంటి యంత్రం ద్వారా కాల్షియంని కట్ చేసుకుంటూ స్టంట్‌ను వేసి ప్రాణాలు కాపాడమన్నారు. ఇది జిల్లాలోనే మొట్టమొదటి అరుదైన చికిత్స అని తెలిపారు. 83 సంవత్సరాల వయసులో గుండె ఆపరేషన్ కూడా చేయటానికి వీలుపడని కారణంగా ఈ అత్యాధునిక పరికరం ద్వారా సాధ్యమైందన్నారు. పేషెంట్ తమపై నమ్మకం ఉంచి ఈ చికిత్సను అందించుకున్నందుకు వారికి కతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రోగి కుటుంబసభ్యులు సుబ్బారావు మాట్లాడుతూ ఎంత కష్టపరిస్థితుల్లోనైనా ఇక్కడే వైద్యం అందించాలని కోరామని, డాక్టర్ శ్రీధర్‌బాబు రిస్కతో కూడుకున్నటువంటి చికిత్సను అందించి నాన్న ప్రాణాలు కాపాడారని వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజర్ దాసరి సుధాకర్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో గొట్టిపాటి, దామచర్ల

ఒంగోలు: ఈ నెల 16న కర్నూలులో ప్రధాని మోడీ సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ సందర్భం గా జన సమీకరణపై మంగళవారం సాయంత్రం కర్నూలు స్టేట్ గెస్ట్ హౌస్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వకపోవడం

మంచి పద్ధతి కాదు..

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అత్యధికంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదని కలెక్టర్ తెలిపారు. ఎనిమిది వేల మంది కౌలు రైతులకు రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, కేవలం 2,326 మంది కౌలు రైతులకు రూ.8.80 కోట్లు రుణం ఇవ్వటమేమిటని ఆరా తీశారు. మీలాంటి వారు సహకరించకపోతే పంటలు ఎలా సాగు చేయగలరని అన్నారు. కౌలు రైతులపై బ్యాంకర్లు చులకన భావం విడిచి పెట్టాలన్నారు. సమావేశంలో కమిటీ డిప్యూటీ కన్వీనర్ సోమేశ్వరరావు, ఎల్ డి ఎం శివకష్ణ, ఆర్బిఐ ఎల్డిఓ గిరిధర్, అన్ని బ్యాంక్ మేనేజర్లు, పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

యూరియా కొరత లేకుండా రైతు సహకార సంఘాలు సమర్థంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాల పని తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, వ్యవసాయ శాఖ జెడి సుబ్రహ్మణ్యేశ్వర రావు, మత్స్యశాఖ జెడి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

జిల్లా అభివద్ధికి సమిష్టి కృషి

అధికారులందరూ సమన్వయంతో పని చేసి.. బాపట్ల జిల్లా పురోభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో కలెక్టర్ పంచాయతీ, మున్సిపాలిటీ విభాగాల పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీలలో తడి చెత్త, పొడి చెత్త సేకరణలో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా.? వారానికి కనీసం రెండు రోజులు మీ ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా.? అనే అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణలో వెనుకబడి ఉన్న పది పంచాయతీలకు కాషన్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, పిడి హౌసింగ్ వెంకటేశ్వరరావు, ఇన్చార్జి పిడి డిఆర్డిఏ లవన్న పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేంద్ర

బిజెపి పాలనలో

ఐఎఎస్, ఐపీఎస్‌లకూ భద్రత లేదు

నిరసన ప్రదర్శనలో దళిత నేత నీలం నాగేంద్ర

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిజెపి సనాతన పాలనలో దళిత జడ్జీలు, ఐఎఎస్, ఐపీఎస్‌లకూ భద్రత లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హర్యానా అడిషనల్ డీజీపీ పూరన్ కుమార్ బలవన్మరణానికి నిరసనగా, పూరన్ భార్య ఐఎఎస్ అధికారిణి అమనీత్ న్యాయ పోరాటానికి మద్దతుగా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్ర మాట్లాడుతూ అమనీత్ కుటుంబానికి మనువాదుల నుండి ముప్పు ఉందని, అమనీత్ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పొటికలపూడి జజయరాం, దళిత నాయకులు కాకుమాను రవి, పిల్లి మాల్యాద్రి, మిట్నసల శాంత, రాజు పాల్గొన్నారు.


జాలాది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జానపద జాబిలి 'జాలాది'

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ జీవనశైలికి అర్థం పట్టే సరళమైన భాషలో సాహిత్యాన్ని అందించిన జానపద జాబిలి జాలాది అని కవి, ప్రజా వైద్యులు శ్రీనివాస్ అన్నారు. జాలాది 14వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో జాలాది చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జాలాది 275 చిత్రాలకు 15 వందల పైచిలుకు పాటలు రాసి సినీ సాహిత్య లోకంలో చెరగని ముద్ర వేశారని అన్నారు. 'కదిలే కాలమా కాసేపు ఆగవమ్మా', 'యాతమేసి తోడిన ఏరుండదు, పగిలి పోగిలి ఏడ్చినా పంట నిండదు' వంటి పాటల ద్వారా పండిత పామరులను సైతం తమ సాహిత్యంతో మైమరిపించిన జాలాది అమరజీవిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో సాహితి భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ, బందా సుందర దుర్గాప్రసాద్, మర్రి మాల్యాద్రిరావు, ఆదం షఫీ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డపల్లి శ్రీరామచంద్ర మూర్తి, కామరాజు కాళిదాసు పాల్గొన్నారు.

నల్లబర్లీ సాగు చేయొద్దు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు రైతులెవరు సాగు చేయవద్దని తహశీల్దారు వివిఎస్‌వి శ్రీనివాసరావు, ఎస్ఐ జి సురేష్, ఏఓ ఎం మేరెమ్మ సంయుక్తంగా తెలిపారు. మండలంలో రైతులు అక్కడక్కడ కొంతమంది పొగాకు సాగు చేసే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సూచనల మేరకు కలెక్టర్ నల్లబర్లీ పొగాకు సాగుకు సంబంధించి క్రాప్ హాలిడే ప్రకటించారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోశాలకు ఆవుల తరలింపు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో రహదారులపై సంచరించే ఆవులను గోశాలకు తరలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మంగళవారం తెలిపారు. రోడ్లపై ఆవులతో వాహన దారులు, ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో వాటిని నాలుగో వార్డులో హిందూ స్మశానవాటికలో సంరక్షించామని అన్నారు. ఇప్పటివరకు ఆవుల యజమానులు తీసుకెళ్లారని ఎదురు చూశామని, అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. చేసేది లేక ఈనెల 15న వాటిని గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. ఆవులను రోడ్లమీద వదల వద్దని మైకులు, కరపత్రాలు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసినట్లు తెలిపారు. ఆవుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాటిని గోశాలకు తరలించక తప్పడం లేదన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చక్రాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల వల్ల అనర్థాలు, గుడ్ టచ్, బాడ్ టచ్, బాలికల హక్కులపై కిషోర బాలికలకు క్విజ్ పోటీలు అంగనవాడీ కార్యకర్త గొట్టిపాటి విశాలక్ష్మి, అచ్చమ్మ నిర్వహించారు. వీరికి గొట్టిపాటి విశాలక్ష్మి, ఎంఇఒ కెవి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని తూర్పు కొప్పెరపాడులో అద్దంకి విద్యుత్ ఈఈ నల్లూరి మస్తానరావు మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని 26 మంది రైతులకు చెందిన 26 వ్యవసాయ బోర్లకు ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ కలెక్షన్లు కావాలని ఒకేసారి దరఖాస్తు చేశారని అన్నారు. అందరూ ఒకసారిగా కలిసి రావటం వలన ఎస్టిమేట్ చార్జీలు రూ.37,50,733 కు గాను ప్రభుత్వం రూ.2.35లక్షలు డిపార్ట్మెంట్‌కు చెల్లించిందని అన్నారు. ప్రభుత్వం తరపున రూ.36,76,482 సబ్సిడీ ఇవ్వటంతో రైతులకు ఎంతో ఉపయోగపడిందని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో నిర్మించినట్లు చెప్పారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు దరఖాస్తు చేసిన వెంటనే ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సౌకర్యం కలిగించటంతో తూర్పు కొప్పెరపాడు రైతులు ఆనంద వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షులు గొల్లపూడి ఆంజనేయులు, ఎనికపాటి శ్రీనివాసరావు, పోనాటి రామాంజనేయులు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారని అన్నారు. డిప్యూటీ ఈఈ ఎం దామోదరం, ఎఇఇ ఆంజనేయులు పాల్గొన్నారు.


ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభిస్తున్న ఈఈ నల్లూరి మస్తానరావు

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ


చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అంశంపై అర్జీస్ఎ యాన్యువల్ యాక్షన్ ప్లానింగ్‌కు సంబంధించి శిక్షణ మంగళవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉంచడం పంచాయతీ బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, నీటి వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

చెరుకుపల్లి : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బాధ్యతగా పనిచేయాలని డిప్యూటీ ఎంపిడిఒ కెజిఎస్ శ్రీనివాసన్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సర్పంచులు, ఉపసర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్

సిపిఆర్ నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిపిఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. జడ్పిటిసి నర్రా సుబ్బయ్య మాట్లాడారు. ప్రజలు సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని అన్నారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాన్ని రక్షించే మార్గాలు నేర్చుకోవచ్చని చెప్పారు. సిపిఆర్‌పై ప్రజలు అవగాహన పెంచుకుని తమ సొంత భద్రతకు, సమాజ సేవకు తోడ్పడాలని అన్నారు. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ ప్రజలు సిపిఆర్ పద్ధతుల గురించి తెలుసుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించడం సులభమవుతుందని చెప్పారు. సిపిఆర్ చేసే పద్ధతులు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఈ నెల 13 నుండి 17 వరకు ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పచ్చపట్ల గంగరాజు, సొసైటీ అధ్యక్షులు నరేష్ యాదవ్, కన్నేటి శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

విజ్ఞాన యాత్రలో వ్యవసాయ పరికరాలపై అవగాహన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

సాంకేతిక పరిజ్ఞాన విషయాలు రైతులు తెలుసుకోవడం ద్వారా సులభ పద్ధతుల్లో వ్యవసాయం చేయవచ్చని రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మీ అన్నారు. మండలంలోని రైతులను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ సౌజన్యంతో బాపట్లలోని పంట కోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రంనకు విజ్ఞాన యాత్రలో భాగంగా తీసుకెళ్లారు. రైతులకు నూతన పరికరాలు, వాటి ఉపయోగాలు వివరించారు. పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించే పరికరాల గురించి అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్ ఏడుకొండలు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే మినీ రైస్ మిల్, అపరాల పంటలకు ప్రాసెసింగ్ పద్ధతులు, వివిధ రకాల నూనె గింజల నుంచి నూనె తయారు చేసే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ వాసుదేవ మాట్లాడుతూ సోలార్ డ్రయర్ పనితీరు, వాటి ఉపయోగాలు వివరించారు. పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా రైతులు పంటకు విలువ జోడించి అదిక ఆదాయం పొందే మార్గాలు డాక్టర్ సందీప్ రాజా వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ రామకృష్ణ, వివిఎలు పాల్గొన్నారు.


విజ్ఞాన యాత్రకు తరలి వెళ్లిన రైతులు



వాటర్ డిస్పెన్సర్ బహుకరిస్తున్న దృశ్యం

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ సహకారంతో వాటర్ డిస్పెన్సర్‌ను జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే దృక్పథంతో మంత్రి సత్యప్రసాద్ సహకారం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులు పచ్చపట్ల గంగరాజు, నిజాంపట్నం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షులు నరేష్ యాదవ్, నర్రా సునీల్, కన్నేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్లు శ్రీనివాస్

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని దుద్దుకూరు బిసి బాలుర వసతి గృహం నోడల్ ఆఫీసర్, తహశీల్దారు ఎవి శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాల ఏర్పాట్లను పరిశీలించారు. పిల్లలకి భోజనానికి వస్తువులు సక్రమంగా ఉన్నప్పటికీ మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా లేదాని విచారించారు. కిచెన్‌ను హైజినిక్‌గా నిర్వహించాలని అన్నారు. దుప్పట్లు, కార్పెట్లు అందలేదని, కాస్మోటిక్ చార్జెస్ రాలేదని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు హాస్టల్లో సమస్యలేవైనా ఎదురైతే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బిఎఆర్ అండ్ టిఎ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని స్కిల్ హబ్ సెంటర్ నందు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషు కుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారిణి ఎం మాధవి మంగళవారం తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తయి 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అక్టోబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు చేస్తారని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పి వినోద్ కుమార్ తెలిపారు. ఇతర వివరాలకు 63027 64962 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని కోరారు.

నేటి నుండి ఖోఖో జట్టుకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 24 నుండి 26 వరకు కర్ణాటకలోని దావనగేరే పట్టణంలో జరిగే 31వ దక్షిణ మండల జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు వెళ్లే ఆంధ్ర ప్రదేశ్ పురుషుల జట్టుకు ఈనెల 15 నుండి శిక్షణ ప్రారంభమవుతుందని ఖో ఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ఆవరణలోని ఎస్ఆర్ఆర్ ఖో ఖో అకాడమీలో జరుగుతుందని అన్నారు. ఈనెల 22వరకు శిక్షణ జరుగుతుందని అన్నారు. జాతీయ సీనియర్ క్రీడాకారుడు షేక్ అలీ నవాజ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు భోజన వసతులు గ్రామ పెద్దలు, దాతల సహకారంతో ఎస్ఆర్ఆర్ ఖో ఖో అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకొని ఈ నెల 22న దావణగారే బయలుదేరి వెళతారని అన్నారు. ఇది 256వ క్యాంప్ అని చెప్పారు.



పరామర్శిస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు నరేష్

సొసైటీ డైరెక్టర్ మీరయ్యకు పరామర్శ

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిజాంపట్నం సొసైటీ డైరెక్టర్ లంకె మీరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయనకు నిజాంపట్నం పీఏసీఎస్ అధ్యక్షులు నరేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు పచ్చిపట్ల గంగరాజు, దిండి మాజీ సర్పంచ్ యేమినేని బుల్లిబాబు కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని చెప్పారు. వారి వెంట నర్రా సునీల్, యేమినేని నరసింహారావు, కన్నేటి శ్రీనివాసరావు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - కొల్లూరు

ఏరో స్కేటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లో గ్రామానికి చెందిన ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన గరిక రిత్విక్, మునిపల్లి పునీత్ బంగారు పథకాలు సాధించినట్లు స్కూలు డైరెక్టర్ తెనాలి నవీన్ పాల్, ప్రిన్సిపాల్ అనిత కుమారి, రాజన్ తెలిపారు. పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవార్డులు సాధించిన రిత్విక్, పునీత్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ-శ్రమ్ కార్డులకు రుసుం లేదు

ప్రజాశక్తి - రేపల్లె

ఈ శ్రమ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులకు ఎలాంటి రుసుంలు సచివాలయంలో ఇవ్వాల్సిన అవసరం లేదని మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు తెలిపారు. కార్డులు ఇప్పిస్తామని ప్రజల నుండి కొంతమంది మోసగాళ్ళు డబ్బు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అటువంటి వారి చేతుల్లో ప్రజలు మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా సచివాలయాలకు వస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ శ్రమ, ఆయుష్మాన్ భారత్ కార్డుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అంటు వ్యాధుల పట్ల అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అంటు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, అంటు వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే చేసేటప్పుడు ఇంటి పరిసరాలు, మరుగుదొడ్ల పారిశుద్ధ్యత గమనించి తగు సూచనలు చేయాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన మానేయాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్న కారణంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. దోమలు అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆ కార్యాలయ దారికి మోక్షం ఎప్పుడో?

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక వెలుగు కార్యాలయానికి వెళ్లే రహదారి ప్రజలకు తలనొప్పిగా మారింది. వర్షం పడిన ప్రతిసారి ఆ మార్గం పూర్తిగా బురదమయంగా మారింది. వాహనాలు నడపడం కష్టంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. వాహనాలపై నుంచి జారి పడిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారిలో కుంకలమర్రుకు వెళ్ళే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఈ మార్గం దారుణ స్థితికి చేరిపోతున్న కారణంగా వెలుగు కార్యాలయానికి రాకపోకలు నరకంగా మారాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు ఆదివారం వచ్చిన విద్యార్థుల్లో ఐదుగురు గల్లంతు కాగా అందులో నలుగురి మృతదేహాలు తీరంకు కొట్టకురాగా మరో విద్యార్థి మృతదేహం మంగళవారం చిన్నగంజాం సముద్ర తీరంలో పోలీసులు గుర్తించారు. ఆనందంగా సముద్ర స్నానానికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు అలల తాకిడికి మునిగి ప్రాణాలు కోల్పోవడం అందరి హృదయాలను కలచివేసింది. నలుగురి మృతదేహాలు రెండు రోజుల క్రితమే లభించగా షారోను ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు కొనసాగించారు. పడవలతో పోలీసులు, రిస్క్యూటీం సముద్రంలో వెతికారు. డ్రోన్ కెమెరాల సాయంతో తీరంలో గాలించారు.

పరామర్శించిన కలెక్టర్, ఎస్పీ

గల్లంతైన షారోను కోసం నిరీక్షిస్తూ తీరం వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, ఎస్పీ బి ఉమామహేశ్వర్ వచ్చి వ్యక్తిగతంగా పరామర్శించారు. బిడ్డ ఆచూకీ దొరికే వరకు కృషి చేస్తున్నాయని, మీ బాధలో మేమంతా మీతోనే ఉన్నామంటూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.



పరామర్శిస్తున్న కలెక్టర్ వినోద్, ఎస్పీ ఉమామహేశ్వర్

చినగంజాం తీరంలో మృతదేహం లభ్యం

చినగంజాం సమీప సముద్ర తీరంలో పోలీసులు గాలిస్తుండగా నీటిలో తేలియాడుతూ షారోను మృతదేహం కంటపడింది. వెంటనే పడవలో షారోను మృతదేహాన్ని తీసుకొచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తీరం వెంటే ఉండి ఎదురు చూసి తన కుటుంబ సభ్యులకు మృతదేహం లభ్యం కావడంతో కుమారుడిని చూసి తల్లి రోదనలో మిన్నంటాయి.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు డిఐఈఓ జికె జాబేద్ చందలూరు జెడ్పి హై స్కూలును మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గతేడాది డిసెంబర్లో జరిగిన మెగా పేరెంట్స్ డే సందర్భంగా హాజరైన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, పేరెంట్స్ కోరారు. కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి సిఫార్సుతో ప్రయత్నాలు ప్రారంభం చింది. ఈ సందర్భంగా కళాశాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, టాయిలెట్స్, మిగిలిన వసతులు, కళాశాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే పిల్లలు అవసరమని అన్నారు. రవాణా సౌకర్యం అడిగి తెలుసుకున్నారు. రెండు క్లాసు రూములు కావాలని, మంచి ప్యాకల్టీని ఇస్తామని తెలిపారు. ఉమ్మడిగా ఒక లెటర్ ఇవ్వాలని అన్నారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా కళాశాల ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం ఇంటర్ క్లాసులకు ఒక రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది సీనియర్ ఇంటర్‌కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి పిఎ బాలాజీ తోపాటు హెచ్ఎం చందలూరు గిరిజ, గ్రామ పెద్దలు కర్రీ వెంకట సుబ్బారావు, పెంట్యాల రామలింగస్వామి, విద్యాదాత వడ్లవల్లి వీరనారాయణ, అడ్డగడ సుబ్బయ్య, మాజీ హెచ్ఎం నార్ని తాతయ్య, పి అంకమ్మ, పెంట్యాల జగబాబు, అడ్డగడ సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐఈఓ జికె జాబేద్

రైళ్లపై రాళ్లు విసిరిన ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

వేగంగా వెళ్తున్న రైళ్లపై రాళ్లు విసిరి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించిన ముగ్గురు యువకులను ఆర్‌పిఎఫ్, జీఆర్‌పి పోలీసులు అరెస్టు చేసినట్లు ఆర్‌పిఎఫ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 12న చీరాల ఆర్ఓబి సమీపంలో గూడ్స్ రైలు తోపాటు వెంటనే వెళ్తున్న విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లు విసిరిన ఘటనలో రైలు బోగి అద్దాలు పగిలిపోయాయని అన్నారు. ప్రయాణికులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రమేష్ బాబు నేతృత్వంలో బృందం ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో సాయంతో నిందితులను గుర్తించామని అన్నారు. రావూరి మణికంఠ సాయి, జగతా సాయి వంశి, మానుపాటి శ్రీనును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా చీరాల ప్రాంత వాసులని తెలిపారు. రైల్వే యాక్ట్ సెక్షన్ 153 కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పిఎఫ్ ఎస్ఐ కొండయ్య, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పిఎఫ్ సిఐ చంద్రశేఖర్

క్రికెట్‌లో సత్తా చాటిన 'సిద్ధార్థ'

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి వీర వెంకట శివ నాగ సిద్ధార్థ సబ్ జూనియర్, సీనియర్స్ ఎలెవన్ క్రికెట్ నేషనల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటారు. ఈనెల 11, 12, 13తేదీల్లో నరసరావుపేటలో జరిగిన పోటీల్లో ఏపి టీంలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. దీంతో త్వరలో ఇండియా అండర్14 తరఫున ఆడే అవకాశం వస్తుందని సిద్ధార్థ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 8 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. సిద్ధార్థ నరసరావుపేటలోని సిబిఐటి పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్నాడు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు ఉపాధ్యాయుల సహకారం బాగుందని అన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థను పలువురు ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులు జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి గుర్తింపు తేవాలని అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ ఎ లక్ష్మి

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

రైతుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎడిఎ అద్దేపల్లి లక్ష్మి అన్నారు. మండలంలోని పేటేరులో ఆత్మ సౌజన్యంతో బాపట్లలోని పంట కోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రంకు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. రైతులు నూతన పరికరాలు, వాటి ఉపయోగాలు తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్ ఏడుకొండలు, డాక్టర్ వాసుదేవ, డాక్టర్ సందీప్ రాజా, ఎఒ ఎ మహేష్ బాబు, విఎఎ రాయల్ బాబు, ఆరేపల్లి వీరబాబు పాల్గొన్నారు.

టపాసు దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

దీపావళి దుకాణాలను ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. చెరుకుపల్లి, ఆరుంబాక లోని రవితేజ, జ్ఞాన తేజ దుకాణాలు తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి సూచనలు అందజేశారు. అనంతరం గుళ్ళపల్లి జెడిపి ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని దీపావళి టపాసులు విక్రయ షాపుల కోసం పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, ఎఫ్ఒ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రేపల్లె : దీపావళి పండుగ సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి, ఎస్డిపిఒ ఎ శ్రీనివాసరావు అధ్యక్షత మాట్లాడారు. పండుగ సమయంలో శాంతి భద్రతా పరమైన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అగ్నిప్రమాదాల నివారణ వంటి అంశాలపై చర్చించారు. అంతేకాకుండా పండుగ సందర్భంలో తాత్కాలిక లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, చుండూరు తహశీల్దార్లు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి - పర్చూరు

వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమావేశం స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు వైసిపి కన్వీనర్ కఠారి అప్పారావు తెలిపారు. వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి హాజరవుతారని తెలిపారు.

జాతీయ ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - అద్దంకి

కళా మిత్ర మండలి (తెలుగు లోగిలి) ఆధ్వర్యంలో 19వ వార్షికోత్సవం సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు నవంబర్ 2న ఒంగోలు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపికైన తొమ్మిది మంది సాహితీ ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో గృహ నిర్మాణంలో ఆదా

ప్రజాశక్తి - పర్చూరు

జీఎస్టీ తగ్గింపుతో గృహ నిర్మాణంలో ఆదా అవుతుందని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. స్థానిక సిమెంట్ దుకాణం, కలవ దుకాణం వద్ద జీఎస్టీ తగ్గింపుపై మంగళవారం అవగాహన కల్పించారు. షాపులో యజమాని కూడా తగ్గించిన జిఎస్టీ ప్రకారం అమ్మకాలు సాగించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కోసనా సత్యనారాయణ పాల్గొన్నారు.

రాతి మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప కట్టుబడి తాలూకా పట్టణానికి చెందిన కోగంటి బసవపున్నయ్య, సుశీలదేవి జ్ఞాపకార్థం వారి మనవరాలు శ్యామ్, సంజయ్, పట్టణంలోని వైద్యులు పోగంటి రంగారావు కుటుంబ సభ్యులు రూ.1,10,116 విరాళం చెక్కును సింగరకొండ దేవస్థానం పాలక మండలి ఐకు మంగళవారం అందించారు.

హాస్టళ్లలో సదుపాయాలు మెరుగుపరచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు



విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు అన్నారు. మంగళవారం ఒంగోలు రైల్వే గేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను పార్టీ బృందం సందర్శించింది. వార్డెన్ అంకబాబు, విద్యార్థులతో మాట్లాడి హాస్టల్ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ హాస్టల్లో చదువుతున్న మూడవ తరగతి నుండి పదోతరగతి వరకు విద్యార్థులకు నెలకు రూ.1400 మాత్రమే మెనూ ఛార్జీలు ఇస్తుండటం అన్యాయమని, 2023 నాటి మెనూ ఇప్పటికీ కొనసాగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని 81 ఎస్సీ హాస్టళ్లలో 36 హాస్టళ్లు అద్దె భవనాల్లో నిర్వహించడం విచారకరమన్నారు. అద్దె భవనాల్లో సదుపాయాలు తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది వారి మానసిక ఎదుగుదలకూ అడ్డంకిగా మారుతోందని తెలిపారు. కాస్మోటిక్ ఛార్జీలు రూ.200 మాత్రమే ఇవ్వడం సరికాదని, ఛార్జీలు పెంచి రెగ్యులర్‌గా విడుదల చేయాలని కోరారు. వర్షాలు, చలికాలం ప్రారంభమైన ఈ సమయంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం, నియమిత వైద్య పరీక్షలు నిర్వహించడం తక్షణ అవసరమని అన్నారు.

జిల్లాలో 81 హాస్టళ్లకు 58 మంది మాత్రమే రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారని, మిగతా హాస్టళ్లు ఇన్‌చార్జ్‌ల ఆధీనంలో నడుస్తున్నాయని తెలిపారు. అన్ని హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. కాగా ట్యూటర్లకు రూ.1500 జీతం ఇవ్వడం అవమానకరమని, గౌరవప్రదమైన వేతనం ఇవ్వాలని, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ తక్షణం పంపిణీ చేయాలని కోరారు.

ప్రతి హాస్టల్‌లో కామాటి, వాచ్‌మెన్, కుక్ - ముగ్గురు సిబ్బంది ఉండాలని, అయితే ప్రస్తుతం కేవలం 160 మంది మాత్రమే రెగ్యులర్‌గా, మిగతావారు అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయంగా బస చేసి పరిశీలించాలని, సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. హాస్టల్ సందర్శించిన వారిలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు బి. రఘురామ్ తదితరులు ఉన్నారు.

'స్ట్రెయిట్‌కట్' భూముల సర్వే పూర్తి

- కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.. - ఆర్‌డివో గ్లోరియా



భూమి కొలతల గురించి మత్స్యకారులకు వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల-బాపట్ల మండలాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ వంపును పూడ్చివేసిన విషయమై మత్స్యకారులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సదరు స్ట్రెయిట్ కట్ కాలువ ప్రాంతంలోని భూముల సర్వే పూర్తి చేశారు. సోమవారమే కొలతలు చేపట్టగా భూ సర్వే తప్పుగా ఉందంటూ మత్స్యకారులు అభ్యంతరం చెప్పారు. దీంతో సర్వే నిలిచిపోయింది. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ వాడరేవు వచ్చిన సమయంలో మత్స్యకారులు ఆయన్ను కలిశారు. భూముల సర్వేకు మత్స్యకారులు సహకరించాలని తాను న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాపట్ల ఆర్‌డివో పి గ్లోరియా, ఎంఆర్‌వో సలీమా, డ్రైనేజి ఇఇ మురళికృష్ణల సమక్షంలో సర్వే చేపట్టారు. వివాదాస్పదమైన ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సీ మౌత్ ప్రాంతాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి జెండాలు పాతారు. భూమి సర్వే చేసిన వివరాలు జిల్లా కలెక్టర్‌కి నివేదిస్తామని బాపట్ల ఆర్‌డివో గ్లోరియా తెలిపారు. అయితే ఈపురుపాలెం స్ట్రెట్ కట్ కాలువ సముద్రంలో కలిసే ప్రదేశం ముఖద్వారం వద్ద అడ్డుగా స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి బుర్ల వెంకట్రావుకి ఇచ్చిన డీ.కే పట్టా (పాండురంగాపురం గ్రామ ఖంఠం) భూమి ఉన్నందున కాలువ సముద్రంలో కలిసిన ప్రదేశం ఏ భూమిలో నుండి వెళ్లి సముద్రంలో కలిసిందో స్పష్టంగా లేదు. బుర్ల వెంకట్రావుకి ఇచ్చిన డీకే పట్టా భూమిలో నుంచి స్ట్రెట్‌గా కలిసి ఉంటే 499-2 సర్వేనెంబర్ సబ్ డివిజన్ జరిగి ఉండాలి. ఆ విధంగా సబ్ డివిజన్ చేసినట్లు ఎక్కడా లేదు. కాబట్టి కాలువ సముద్రంలో కలవాలంటే బుర్ల వెంకట్రావుకి ఇచ్చిన డీకే పట్టా భూమి విషయమై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరి జిల్లా అధికారులు ఏం చేస్తారో వేచి చూడాల్సి ఉంది.



కూలిన భారీ చెట్టు

కూలిన భారీ వృక్షం

కర్నూల్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు-కర్నూలు రహదారిలో నవభారత్ బిల్డింగ్స్ వద్ద గల భారీ చింతచెట్టు నేలకూలింది. దీంతో ఆ రోడ్డులో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ రోడ్డులో గత కొన్ని రోజుల నుండి డ్రెయినేజీ కాలు, నిర్మాణం పైపు లైన్ మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం నాడు చెట్టు ప్రక్కన పైపు లైన్ కోసం గుంత తవ్వారు. గుంత తవ్విన కొద్ది సేపటికే చెట్టు ఒక్కసారిగా రోడ్డుకి అడ్డంగా కూలిపోయింది. దీంతో రోడ్డుకి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. తాలూకా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది దాదాపు రెండు గంటల పాటు శ్రమించి చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. చెట్టు కూలే సమయంలో సమీపంలో మనుషులు గానీ, వాహనాలు కానీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్ద మాగుంట పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

నేడు ఎంపీ మాగుంట జన్మదిన వేడుకలు

భారీగా వెలసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం జరగనున్నాయి. ఒంగోలు రాంనగర్ రెండవ లైన్ లోని ఎంపీ మాగుంట కార్యాలయంలో జరిగే పుట్టినరోజు వేడుకలకు మాగుంట అభిమానులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. గత ఏడాది అనివార్య కారణాలతో మాగుంట జన్మదిన వేడుకలు పాక్షికంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఎంపీ మాగుంట జన్మదిన వేడుకలను భారీగా నిర్వహించేందుకు అభిమానులు చర్యలు చేపట్టారు. ఎంపీ మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన అభిమానులు ఒంగోలు నగరంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు అభిమానులు ఏర్పాట్లు చేశారు. ఎంపీ మాగుంట జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన కార్యాలయం వద్ద సంగీత విభావరి ఏర్పాటు చేశారు. మాగుంటకి శుభాకాంక్షలు తెలియజేసే ప్రముఖులు, అధికారులు, కూటమి నేతల కోసం అభిమానులు ఏర్పాట్లు చేశారు.

ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా చర్యలు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఖనిజ సంపద నిధి (డిఎంఎఫ్) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఖనిజ సంపద కింద చిన్న, పెద్ద గ్రానైట్ క్వారీలు, ఇసుక క్వారీల నుంచి చట్టబద్ధంగా సీనరేజ్ ద్వారా ఖనిజ సంపద నిధి సేకరించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.51.22 కోట్ల నిధి ఉందన్నారు. మార్చి నాటికి మరో రూ.నాలుగు కోట్లు సీనరేజ్ వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాకు వచ్చే ఖనిజ సంపద నిధిని జిల్లా అభివద్ధికి వినియోగించాలన్నారు. ప్రస్తుతం రూ.48.68 కోట్లతో అభివద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. 42 పనులు చేయడానికి అధికారికంగా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ మైన్స్ డిడి రామచంద్ర, కమిటీలోని సభ్యులైన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ కార్మికుల సమ్మె

- రెగ్యులరైజేషన్, వేతన సమీకరణ కోసం ఆందోళన
- స్ట్రగుల్ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 15న జరగనున్న సమ్మెకు బలమైన మద్దతు లభిస్తోందని ప్రకాశం జిల్లా స్ట్రగుల్ కమిటీ నాయకులు ప్రకటించారు. ఆ మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మిక నాయకులు సంస్థ పరిరక్షణ, కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. ఒంగోలు రీజియన్ ప్రకాశం జిల్లా అడ్వైసర్స్ జి.వి.రాగయ్య, ఎం.నరసింహారావు, అధ్యక్షులు ఇరుగుల శీనురెడ్డి, ప్రధాన కార్యదర్శి దండే రవికుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జీవీ.కొండారెడ్డి, అధ్యక్షులు శీలం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చాట్రగడ్డ శ్యామ్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయకపోవడం, వేతన వ్యత్యాసాలు కొనసాగించడం అన్యాయం అన్నారు. ఒకే సంస్థ - ఒకే సేవ - ఒకే నియమావళి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా వేతనాలు చెల్లించడం ద్వారా విద్యుత్ సంస్థకు 192 కోట్ల భారం తగ్గుతుందని, వేతన వ్యత్యాసం తొలగి, అరియర్స్ చెల్లించే వీలుంటుందని పేర్కొన్నారు. పీసిరేట్ వర్కర్లు, స్టోర్స్ హమాలీలు, మీటర్ రీడర్లు, పీసీఏలు, ఎటిఎంలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. కారుణ్య నియామకాల్లో లోపాలు సరి చేయాలన్నారు. నగదు రహిత మెడికల్ పాలసీని విస్తరించాలని, అర్హులైన ఉద్యోగులకు జేఈ, జేఏ కన్వర్షన్ ఇవ్వాలని నాయకులు కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె తప్పదని హెచ్చరించారు. దానికి పూర్తి బాధ్యత యాజమాన్యం వహించాలన్నారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఐక్య పోరాటం కొనసాగుతుందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్, ఎనర్జీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, యుఈఈయు జేఎల్ఎం గ్రేడ్ 2 యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సమ్మెలో పాల్గొంటున్నట్లు స్పష్టం చేశారు.